క్లుప్తంగా

వైభవంగా మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ



రోళ్లపాడుతండాలో మారెమ్మవ్వ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: మండల పరిధిలోని రోళ్లపాడుతండాలో మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కడమకుంట్లకు చెందిన దివంగత హనిమిరెడ్డి సతీమణి మాధవమ్మ, తనయుడు అమరనాథరెడ్డి, సునీత దంపతులు, కుటుంబ సభ్యులు దాదాపు రూ.20 లక్షలు ఖర్చు చేసి ఆలయం నిర్మించారు. మూడు రోజులుగా వేద పడింతులు గుండు వేణుగోపాల శాస్త్రి (బెల్దోణ స్వామి) ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. చివరి రోజు హోమాలు, ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠ పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మారెమ్మవ్వ దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. సుగాలి మహిళలు చేసిన నృత్యాలు అలరించాయి.

విస్తృత ప్రచారం



ఎమ్మిగనూరు 19వ వార్డులో ఓటర్లను అభ్యర్థిస్తున్న బుట్టా ప్రతుల్

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న తన తల్లి బుట్టా రేణుకను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం ఆమె కుమారుడు బుట్టా ప్రతుల్ పట్టణంలోని 19, 27వ వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు పూజేశ్వరి, శ్రీధర్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేపట్టి అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ అంపమ్మ, వార్డు ఇన్‌చార్జ్‌లు గోకారి, నాగేష్, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

పీఈటీపై చర్యలు

మద్దికెర: బాలికతో దురుసుగా ప్రవర్తించిన పీఈటీ సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాలు.. మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన బాలిక గుంతకల్లులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతోంది. గత శనివారం బాలిక స్నాక్స్ చోరీ చేసిందని ఓ విద్యార్థిని పీఈటీ అనితకు ఫిర్యాదు చేయడంతో బాలికను దండించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక హాస్టల్ గదిలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు చెప్పడంతో కిందకు దించారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సనందించారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విద్యార్థిని పట్ల దురుసుగా ప్రవర్తించిన పీఈటీ అనితను సస్పెండ్ చేస్తున్నట్లుగా కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్ ఆదేశాలు జారీ చేశారు.

టీడీపీ అభ్యర్థికి కోడ్ ఉల్లంఘన నోటీసు

ఆలూరు: ఆలూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్‌కు ఎన్నికల కోడ్ ఉల్లంఘన నోటీసులు జారీ చేసినట్లు ఆర్‌ఓ డి.రామునాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని హొళగుంద మండలంలో వీరభద్రగౌడ్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ముందస్తు అనుమతి లేకుండా అధిక వాహనాలు వినియోగించడంతో పాటు సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్ చేస్తూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడడంతో నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం చేసేందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు.

అతివేగం ప్రమాదకరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మద్దికెర: అతివేగంతో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి సూచించారు. ఆయన గురువారం మండల కేంద్రంలో రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. రోడ్డుపై లైసెన్స్ లేకుండా వెళ్తున్న వాహనదారులకు, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. మితిమీరిన వేగంతో వాహనం నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఎస్‌ఐ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

• అయ్యో పాపం

వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి పింఛన్ సొమ్ము చేతిలో పెట్టడంతో రాజులా కాలం వెళ్లదీసిన వారు నేడు చంద్రబాబు నాయుడు పన్నిన కుట్రతో దీనవస్థితికి చేరారు. ఈ చిత్రంలో కనబడుతున్న వ్యక్తి పేరు బోయ మద్దె లక్ష్మన్న. హొళగుంద సచివాలయం–2 పరిధిలో ఇతని ఇల్లు ఉండగా నా అనే వాళ్లు ఎవరూ లేరు. బంధువైన ఓ మహిళ సాయంతో కాలం వెల్లదీస్తున్నాడు. పుట్టుకతో గుడ్డి వాడైన లక్ష్మన్నకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచడంతో పాటు వలంటీర్లు ద్వారా ఇంటి వద్దనే అందిస్తూవచ్చారు. ప్రస్తుతం చంద్రబాబు కుట్రతో లక్ష్మన్న పింఛన్ కోసం మరొకరి సాయంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. చేసేది లేక గురువారం మరో వ్యక్తి సాయంతో ఎండలో కిలోమీటర్ల దూరంలోని సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తీసుకున్నాడు. తమలాంటి వారిని ఇబ్బందులు పెడితే చంద్రబాబుకు ఏమొస్తుందని ఆవేదనతో ప్రశ్నిస్తున్నాడు. – హొళగుంద



పింఛన్ కోసం మండుటెండలో మరొకరి సాయంతో వస్తున్న అంధుడు లక్ష్మన్న

అవ్వాతాతలకు ఎండదెబ్బ

- మండుటెండలో పడుతూలేస్తూ సచివాలయాలకు చేరుకున్న లబ్ధిదారులు
- కార్యాలయాల వద్ద పింఛన్ కోసం పడిగాపులు
- రెండవ రోజు 60 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



ఆలూరు సచివాలయం-2 వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

ఆలూరు రూరల్: రాష్ట్రంలో ఐదేళ్ల తర్వాత మళ్లీ పాత రోజులు దర్శనమిచ్చాయి. బుధవారం మొదటి రోజు పింఛన్ పంపిణీ ఆలస్యంగా ప్రారంభం కావడంతో గురువారం ఉదయాన్నే అవ్వాతాతలు, వితంతువులు సచివాలయాల వద్దకు చేరుకుని పింఛను నగదు కోసం వేచి చూశారు. ఉదయం 10 గంటల నుంచి నిబంధనలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాలతో అన్ని సచివాలయాల వద్ద షామియానాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. వలంటీర్ల సేవలను తమకు దూరం చేసిన చంద్రబాబు కుట్రలపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్మును ఇంటివద్దకే అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరువలేమన్నారు. కొందరు పనులు మానుకుని పింఛన్ల కోసం వచ్చామని, చంద్రబాబు కుట్రతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. అనారోగ్యంతో మంచం పట్టిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు పింఛన్ల కోసం వేచి చూస్తున్నారు. ఇదిలాఉండగా మండలంలో రెండవ రోజు 60 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది.

ప్రభుత్వ చొరవతో వేగంగా పింఛన్ల పంపిణీ

నందవరం: రాష్ట్ర ప్రభుత్వ చొరవతో పింఛన్ల పంపిణీ రెండవ రోజు గురువారం వేగవంతంగా సాగింది. చంద్రబాబు అండ్ కో కుట్రలను అధిగమించి పింఛన్ల పంపిణీ సాగుతోంది. మంచం పట్టిన అవ్వాతాతలు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. నదికైరవాడికి చెందిన సురేష్ మంత్రాలయంలో ఉన్నాడని తెలుసుకున్న సచివాలయ కార్యదర్శి హసీనా అక్కడికి వెళ్లి దివ్యాంగ పింఛన్ రూ.3 వేలు అందజేసింది. నందవరం మండలంలో గురువారం నాటికి 87.86 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. మొత్తం 7,157 మంది పింఛనదారులకుగాను ప్రభుత్వం రూ.2,11,73,500 మంజూరు చేసింది. అందులో 6,288 మంది లబ్ధిదారులకు పింఛన్ అందించినట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

కొనసాగుతున్న కష్టాలు

ఆస్పరి: మండలంలోని గ్రామాలలో రెండవ రోజు గురువారం పింఛన్ సొమ్ము తీసుకునేందుకు లబ్ధిదారుల అవస్థలు కొనసాగాయి. సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడ్డారు. బంధువుల సాయంతో సచివాలయాల వద్దకు చేరుకుని వేచిఉండి పింఛన్ తీసుకున్నారు. ప్రతి సచివాలయం వద్ద పింఛన్ కోసం లబ్ధిదారులు బారులు తీరారు. మండలంలో 7,318 పింఛనుదారులుండగా ఇప్పటివరకు 6,545 మందికి పింఛన్ అందజేసినట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మిగిలిన వారికి శుక్రవారం పంపిణీ చేస్తామని చెప్పారు.

చంద్రబాబుకు కడుపు మంట ఎందుకు..



వృద్ధులకు ఇంటి వద్దకే పింఛన్ ఇస్తుంటే చంద్రబాబుకు కడుపుమంట ఎందుకో?. ఈ నాలుగున్నరేళ్లు సచివాలయం ఎక్కడ ఉందో తెలియదు. ప్రతినెలా 1వ తేదీన వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. నాకు మోకాళ్ల నొప్పులతో నడవలేని పరిస్థితి. అయిన కుంటుకుంటూ వాకర్ సాయంతో అవస్థలు పడుతూ సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకున్నా. వలంటీర్ వచ్చి డబ్బులు ఇచ్చి వెళ్లిపోతాడు తప్ప ఏమి చేయడు కదా?

– తలారి నర్సప్ప, వృద్ధుడు, ఆలూరు



వందవాగిలిలో పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

చంద్రబాబు నిర్వాకంతో అష్టకష్టాలు

హొళగుంద: ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు నిర్వాకంతో నడవలేని వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులు పింఛన్ కోసం పడరాని పాట్లు పడ్డన్నారు. గతంలో టీడీపీ పాలన నాటి పింఛన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని లబ్ధిదారులు చర్చించుకుంటున్నారు. చంద్రబాబు ఈసీకీ చేసిన ఫిర్యాదు కారణంగా వలంటీర్ సేవలు నిలిచిపోవడంతో లబ్ధిదారులు రెండు రోజులుగా అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు చేరుకుని వేచి ఉండి పింఛన్ సొమ్ము అందుకుంటున్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మండలంలో మొత్తం 6,127 మంది పింఛనుదారులుండగా రెండు రోజుల్లో 5,438 మందికి సొమ్ము అందించి 90 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు.

పోస్టు ద్వారా ఓటరు కార్డుల జారీ

ఆలూరు రూరల్: కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న వారికి ఎన్నికల సంఘం ఓటరు కార్డులను మంజూరు చేస్తోంది. స్పీడ్ పోస్టులో నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిస్తోంది. ఎన్నికల సంఘం రూపొందించిన ఎపిక్ కార్డు భద్రతా ప్రమాణాలను కలిగి ఉన్నాయి. నకిలీ ఓటర్లు, దొంగ ఓట్లను నివారించేందుకు ట్యాంపరింగ్ చేసేందుకు వీల్లేని విధంగా హాలోగ్రామ్ ఉంది. కార్డు వెనుక భాగంలో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఓటరు వివరాలు కనిపిస్తాయి. గతం కంటే మెరుగ్గా ఓటరు ఫొటో స్పష్టంగా ఉండటంతో పాటు వారి పేరు, చిరునామా పూర్తి వివరాలను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

నందవరం: మండలంలోని కనకవీడు పేట గ్రామంలో ఇలవేల్పు, మహిమాన్వితులు రామప్ప, లక్ష్మప్ప విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుక వైభవంగా జరిగింది. గురువారం ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా కానిచ్చారు. అంతకుముందు అశ్వర్థ నారాయణ కల్యాణ వేడుక గావించి శాంతి, వాస్తు, లోకకల్యాణ హోమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక వేడుకలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆమెతోపాటు పేట శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, డీలర్ ఈరన్న, వడ్డె హనుమంతు, నల్లన్న, వెంకటేష్, కోసిగి ఈరన్న , రామన్న గౌడ్ తదితరులు ఉన్నారు.

6న బెల్లం వేలం పాట

పత్తికొండ రూరల్: పత్తికొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో నాటుసారా తయారీకి తరలిస్తుండగా 7 కేసుల్లో పట్టుబడిన 17 వేల కిలోల బెల్లంను ఈ నెల 6వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ ఉన్న వ్యాపారులు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తీసుకొచ్చి రూ.20 వేలు డిపాజిట్ (రిఫండబుల్) చెల్లించి స్టేషన్ ఆవరణలో 10.30 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

పారదర్శక పాలనకు పట్టం కట్టాలి



కూరగాయల దుకాణదారుతో మాట్లాడుతున్న దృశ్యం



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 23వ వార్డు కార్యకర్తలతో బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ అందించిన సీఎం వైఎస్ జగనన్న పారదర్శక పాలనకు మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పట్టణ ఓటర్లను కోరారు. ఆమె గురువారం పట్టణంలోని 4వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. రాష్ట్ర కుర్ణిక రికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, 4వ వార్డు ఇన్‌చార్జ్ బుట్టా రంగయ్య, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె వార్డులో ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను గెలిపించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించారు. చేనేత కార్మికులను కలిసి ఓ ఇంట్లో మగ్గం నేసి నేతన్న నేస్తం సంక్షేమ పథకం అమలు గురించి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని, టీడీపీ కల్లబొల్లి మాటలు నమ్మక సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు అధికారం ఇస్తే జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తాడని, మళ్లీ పాత దుర్మార్గపు పాలనే వస్తుందన్నారు. రాష్ట్ర శాప్‌నెట్ వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, యూకే రాజశేఖర్, సునీల్‌కుమార్, అమాన్, శివప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి షాక్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన టీడీపీ శ్రేణులు గురువారం పెద్ద ఎత్తున ఆ పార్టీని వీడారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో ఆ పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, 23వ వార్డు కౌన్సిలర్ చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు తరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డు టీడీపీ నాయకులు జేఎల్ ప్రసాద్‌తోపాటు శివ, యోగి, ఉపేంద్ర, హుసేని, సుంకన్న, మహేష్‌తో పాటు 150 మంది పార్టీలో చేరడంతో వారికి బుట్టా రేణుక, ప్రతుల్‌లు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక నాయకులు మహేశ్వర్‌రెడ్డి, భాస్కర్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



వెల్దుర్తిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామగ్రామాన చేసిన అభివృద్ధి, కల్పించిన సౌకర్యాలను చూసి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విన్నవించారు. ఆమె గురువారం వెల్దుర్తిలో తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్నతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకుసాగారు. ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టారు. గజమాలలతో స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు, మధ్య తరగతి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి, కరోనా సమయంలోనూ వెరవకుండా నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వం తమదన్నారు. వెల్దుర్తి పట్టణానికి రూ.కోట్ల నిధులతో తాగునీటి సమస్య తీర్చామన్నారు. ఇంటింటికీ కుళాయి పథకం అమలు చేశామన్నారు. అధునాతన ఆసుపత్రి నిర్మించి, పదుల సంఖ్యలో వైద్యుల నియామకం చేశామన్నారు. వీధి వీధినా సీసీ రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. నాడు నేడు కింద పాఠశాలల అభివృద్ధి, సౌకర్యాల కల్పన చేశామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలు వారి ముంగిటకే తెచ్చామని వివరించారు. పట్టణంలో మూడు సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు కనబడుతున్నాయన్నారు. 30 మందికి పైగా ఉద్యోగులు సేవలందిస్తున్నారన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు కుట్ర పన్ని వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్నా సచివాలయ వ్యవస్థ ద్వారా వీలైనంత వరకు లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా అందిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకుల ప్రలోభాలకు లోనుకావద్దని, హామీలిచ్చి నెరవేర్చని మోసకారుల మాటలు నమ్మవద్దని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు (ఎంపీ, ఎమ్మెల్యే) వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సర్పంచ్ ముత్యాల శైలజ, బొమ్మన పెద్దిరెడ్డి, అగస్టీన్, వెంకటనాయుడు, బాలాజీ, ఆరిఫ్, రాజు, రాజశేఖర్, కొత్తూరు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దేవనకొండ: మండలకేంద్రంలో ఇంటి నంబర్ 2/77/1లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. పేకాట ఆడుతున్న ఈడిగ రామదాసుగౌడ్ (బైరవకుంట), బోయ కౌలుట్ల (గద్దెరాళ్ల), బోయ కనికిటి వెంకటేష్ (కప్పట్రాళ్ల), బోయ తలారి రంగస్వామి (పల్లెదొడ్డి), బోయ బసవరాజు (పల్లెదొడ్డి), గొల్ల తిరుపతయ్య (పల్లెదొడ్డి), బోయ వీరేంద్ర (కుంకనూరు)లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.14,150 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, పంచనామా చేసినట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

దౌర్జన్యం చేసినట్లు నిరూపిస్తే శిక్షకు సిద్ధం

- ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన వార్తను ఖండించిన ఎంపీపీ

ఎమ్మిగనూరురూరల్: స్థలం విక్రయించాలని తాను బలవంతం చేయడం, దౌర్జన్యం చేసినట్లు నిరూపిస్తే శిక్షకు సిద్ధమని మండల అధ్యక్షుడు గొల్ల కేశన్న గురువారం రాత్రి స్పష్టంచేశారు. బుధవారం రాత్రి గ్రామంలో తమ దాయాదుల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగిందని దీనిపై 'స్థలం కోసం వైఎస్సార్‌సీపీ ఎంపీపీ, అనుచరులు వీరంగం అంటూ 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన వార్త పూర్తి అవాస్తమని ఎంపీపీ చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపించబడిన వారి వివరణ తీసుకోకుండా రాజకీయ లబ్ధి కోసం తప్పుడు కథనాలు రాయడం మంచిది కాదన్నారు. ఘర్షణ పడిన ఇరువర్గాల వారూ తమ బంధువులేనని, మద్యం తాగి వచ్చి తిట్టుకుంటు వెళ్తుంటే ప్రశ్నించడంతో ఘర్షణ ఏర్పడిందన్నారు. ఈ గొడవలో ఇరు కుటుంబాల వారికి గాయాలయ్యాయని, ఒకవైపు వారికే గాయాలైనట్లు తప్పుడు వార్త ప్రచురించారని పేర్కొన్నారు. తాను గానీ, అనుచర వర్గం గానీ ఎక్కడైన భూములు కబ్జా చేసినట్లు, దౌర్జన్యం చేసి రాయించుకున్నట్లు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. కుటుంబాల మధ్య వివాదాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదిస్తూ తప్పుడు రాతలు రాయడం మంచి పద్ధతి కాదన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల అభివృద్ధి



మాట్లాడుతున్న కో-ఆప్షన్ మెంబర్ సర్వర్‌ఖాన్

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీతోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యమని మండల కో–ఆప్షన్ మెంబర్ సర్వర్‌ఖాన్ అన్నారు. ఆయన గురువారం చిప్పగిరిలో మాట్లాడుతూ.. పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ ఆరు గ్యారెంటీలు అంటూ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పత్తికొండ రూరల్: పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో గురువారం చలివేంద్రం ఏర్పాటుచేశారు. మండువేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం తాగునీరు అందించేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన తెలిపారు. వేసవిలో డీహైడ్రేషన్‌కు గురికాకుండా ప్రతి ఒక్కరూ నీటిని ఎక్కువగా తీసుకోవాలన్నారు. వైద్యులు ఆదినగేష్, సత్యనారాయణరెడ్డి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో నెల పూజ



హాలహర్వి: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం నెలపూజ కార్యక్రమాన్ని ఆలయ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టారు. కర్ణాటక, ఆంధ్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి జోడు రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగి నెల రోజులు పూర్తికావడంతో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

వలంటీర్ల రాజీనామా

మద్దికెర: మండలంలోని ఎడవలి గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు గురువారం రాజీనామా పత్రాలను ఎంపీడీఓ అలివేలమ్మకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిస్వార్థంగా ప్రజలకు చేరవేశామని, రాజకీయ పార్టీలు వలంటీర్లను నిందించడం భావ్యం కాదన్నారు. నిరాధర ఆరోపణలతో మనోవేదనకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. మనస్తాపంతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

ఆదోని సెంట్రల్: కోసిగి–కుప్పగల్ రైల్వేస్టేషన్‌ల మధ్య 518/11–13 కి.మీ. మధ్య పీకలబెట్ట గ్రామం వద్ద గురువారం ఉదయం 9:30 గంటల సమయంలో తెలుగు కృష్ణ (49) రైలు నుంచి జారి కిందపడి మృతి చెందాడని రైల్వే ఎస్‌ఐ కె.గోపాల్ తెలిపారు. మృతుడు ఆదోని పట్టణంలోని రాయనగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. సమాచారాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రాజన్న రాజ్యం మళ్లీ తెచ్చుకుందాం



టీడీపీని వీడి పార్టీలో చేరిన నాయకులతో విరూపాక్షి



బహిరంగ సభకు భారీగా హాజరైన కార్యకర్తలు

ఆలూరు రూరల్: రాష్ట్రంలో రాజన్న రాజ్యం మళ్లీ అధికారంలోకి వస్తుందని, సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా కొనసాగుతాయని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి అన్నారు. ఆయన గురువారం హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీగా ర్యాలీగా తరలివచ్చి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి ప్రభంజనం సృష్టించాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకొస్తారని విమర్శించారు. ప్రజలంతా ఐదేళ్ల జగనన్న సంక్షేమ పాలనను చూసి ఓటు వేయాలని కోరారు. గూళ్యం సర్పంచ్ ఉలిగమ్మ, ఎంపీపీ పక్కీరమ్మ, నాయకులు జనార్ధన్‌నాయుడు, రామిరెడ్డి, బజారప్ప, నాగేష్, మల్లికార్జున, తిప్పారెడ్డి, గంగాధర్, సామ్యా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి కోలుకోలేని దెబ్బ

గూళ్యం గ్రామంలో టీడీపీ పార్టీకి చెందిన మైలారప్ప గారి కురువ వీరేష్, కురువ మారెప్ప, కురువ సికింద్ర, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యల్లప్ప, గోవిందు, కటికే సాయిబన్న, పింజరి మహమ్మద్‌లతో పాటు వెయ్యి మంది కార్యకర్తలు గురువారం విరూపాక్షి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. కొత్తగా పార్టీలోకి వచ్చే ప్రతి నాయకుడు, కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని, అన్ని విధాలా అండగా ఉంటామని విరూపాక్షి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమికి ఓటమి తప్పదని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

కుట్రల కూటమికి ఓటుతో బుద్ధిచెప్పాలి

దేవనకొండ: రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలిపిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని విరూపాక్షి అన్నారు. ఆయన గురువారం మండలంలోని సింగాపురం గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలన కావాలో, చంద్రబాబు రాక్షస పాలన కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. మీ ఇంటికి మంచి జరిగి ఉంటేనే నాకు ఓటు వేయండి అనే నాయకుడు జగనన్న అని, మీరు ఏమైపోతే నాకేంటి నాకు మాత్రం ఓటు వేయండి అనుకునే వ్యక్తి చంద్రబాబు అన్నారు. జగనన్నను ఎదుర్కోలేక టీడీపీ, జనసేన, బీజేపీ దుష్టశక్తులు కలిసి వస్తున్నాయని, కుట్రల కూటమికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, దివాకర్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు ధనుంజయ, దస్తగిరి, ఆనంద్, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.